క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మాక్లూర్: మాదాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ఆదివారం బీజేపీ మండల అధ్యక్షురాలు మదారి మమత ప్రారంభించారు. శ్మశానవాటికకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతుండటంతో గ్రామస్తులు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని నిధులు ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నిధులు మంజూరు చేయడంతో పనులను ఆమె ప్రారంభించారు. వీడీసీ అధ్యక్షుడు వినోద్, మదారి రాజేశ్వర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి

వేల్పూర్: పంటరుణాల మాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులంతా ఎక్కడికక్కడ నిలదీయాలని బీఆర్ఎస్ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.2 లక్షల లోపు రుణమాఫీ జరుగని వారు కూడా వేలాది మంది రైతులు ఉన్నారన్నారు. అంతేగాక రూ.2 లక్షలపైన ఉన్న రుణం బాకీ చెల్లించినవారికి కూడా మాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ మాట మార్చి రూ.2 లక్షలపైన రుణం ఉన్నవారికి మాఫీ చేయబోమని పేర్కొనడం రైతులను మోసగించడమేనని ఆరోపించారు.

ఆర్థిక సాయం



రుద్రూర్: అంబం(ఆర్) గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించి నిరాశ్రయులైన ఇద్దరు మహిళలకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ కన్వీనర్ యలమంచిలి శ్రీనివాస్ రావ్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అత్కురి మహేష్, నందు పటేల్, బట్టు నాగయ్య, శానం కపిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో దుబాయిలో మరణించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఆదివారం అందజేశారు. దీనికోసం బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి చేసిన కృషికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



నవీపేట: జీవనోపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్ల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు కటారి రాములు డిమాండ్ చేశారు. ఈ నెల 24న తలపెట్టిన ఛలో పార్లమెంట్ వాల్ పోస్టర్లను ఆయన మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఆటో డ్రైవర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, వారికి రూ.4 వేల పింఛన్, రూ.12 వేల వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్, కబీర్‌ఖాన్, ఆంజనేయులు, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ఎస్. దాస్(60) డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేశారు. శనివారం అనారోగ్యంతో దాసు మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి, బోధన్ లయన్స్ ఐ ఆస్పత్రికి ఉచితంగా అందజేశారు.

హిందీ పండిత్‌గా అశోక్ సేవలు ప్రశంసనీయం



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన హిందీ పండిత్‌గా జి.అశోక్ అందించిన సేవలు ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. పోతంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేస్తున్న అశోక్‌ను ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, మాజీ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

పదేళ్ల తర్వాత మోక్షం..!

- రూ.3 కోట్ల 50 లక్షలు ఖర్చు చేసినా పూర్తవ్వని ఆచన్‌పల్లి – పెద్దమావంది హైలెవల్ వంతెన
- ఇటీవల రూ.కోటి 44 లక్షలతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- దశాబ్దకాలం తర్వాత మళ్లీ మొదలవనున్న పనులు



మధ్యలోనే నిలిచిపోయిన పెద్దమావంది - ఆచన్‌పల్లి హైలెవల్ వంతెన పనులు

బోధన్‌రూరల్: పెద్దమావంది శివారులోని పసుపువాగుపై నిర్మాణం చేపట్టిన ఆచన్‌పల్లి–పెద్దమావంది హైలెవల్ వంతెనకు పదేళ్ల తర్వాత మోక్షం లభించింది. గతంలో సుమారు రూ.3 కోట్ల 50 లక్షలు ఖర్చు చేసినా వంతెన పనులు పూర్తి కాలేదు. మండలంలోని బండార్‌పల్లి, చిన్నమావంది, పెద్దమావంది గ్రామస్తుల సౌకర్యార్థం చేపట్టిన ఈ హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో మధ్యలోనే నిలిచిపోయాయి. సకాలంలో పనులు పూర్తవ్వకపోవడంతో అంచనా వ్యయం పెరిగి నిర్మాణ పనులు ఏళ్లుగా పెండింగ్‌లో పడ్డాయి.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో నిధులు..

రాష్ట్రంలో 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం, బోధన్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున పి.సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడటంతో చిన్నమావంది, పెద్దమావంది, బండార్‌పల్లి గ్రామస్తులు వంతెన సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేక చొరవ చూపించి మిగిలిన పనుల కోసం రూ.కోటి 44 లక్షల నిధులు మంజూరు చేయించి ఇటీవల శంకుస్థాపన చేశారు. త్వరగా పనులు చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కూడా ఆదేశించారు.



హైలెవల్ వంతెన వద్ద పరిస్థితిని ఇటీవల పరిశీలిస్తున్న అధికారులు

సాగు కష్టాలు దూరం.. తగ్గనున్న దూరభారం

ఈ హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రస్తుతం సమీపంలో పొలాలు ఉన్న రైతులు వాగులోంచి నీటిలో నడుచుకుంటూ తమ పొలాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రైతులు సాగుకు అవసరమయ్యే ఎరువులు, మందులు, ఇతర సామగ్రి తీసుకెళ్లాలంటే బోధన్ పట్టణ శివారులోని శ్రీనివాస్‌నగర్ మీదుగా అదనంగా 5 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత రైతులకు పొలాలకు వెళ్లే దూరం తగ్గడంతో పాటు బోధన్ పట్టణం, నిజామాబాద్‌కు వెళ్లేందుకు దూరం సైతం తగ్గుతుంది.

ఏప్రిల్‌లో పనులు ప్రారంభిస్తాం

హైలెవల్ వంతెన పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెలాఖారులోపు టెండర్ పనులు పూర్తి చేస్తాం. ఏప్రిల్‌లో పనులు ప్రారంభించి త్వరగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– కె. రాజయ్య, డీఈఈ, పంచాయతీ రాజ్ శాఖ, బోధన్

భగత్ సింగ్‌కు ఘన నివాళులు



బోధన్‌లో.. పీడీఎస్‌యూ- పీవైఎల్ నాయకులు



ఆలూర్ మండలం మచ్చర్లలో.. ప్రజాపంథా నేతలు

జిల్లాలో పలుచోట్ల ఆదివారం వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్‌తో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



నవీపేటలో భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జన వికాస్ సేవా సమితి నేతలు



వర్నిలో ..సీపీఎం నాయకులు



గోనుగొప్పులలో .. సీపీఐఎంఎల్ నేతలు



రామన్నపేట్‌లో.. మాస్‌లైన్ నేతలు



పచ్చలనడ్కుడలో.. కాంగ్రెస్ నేతలు

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బాల్కొండ: మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి–44 పక్కన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచెను ఏర్పాటు చేయలేదు. అటువైపు వెళ్లే పశువులు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు రుద్దటమో..తగలడమో గానీ జరిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వాహనదారులు కూడా ప్రమాదం బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా నాయకులు విఠల్ గౌడ్, నల్ల గంగాధర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల పార్లమెంటు ముందు నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం మార్పులు చేస్తోందని ఆరోపించారు. నాయకులు రాజు, వై.దత్తు, పండరి తదితరులు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన మహారాష్ట్ర రైతులు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన 30 మంది రైతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అంకాపూర్‌లో సాగవుతున్న మొక్కజొన్న, పసుపు, ఆయిల్ పామ్ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే విత్తన శుద్ధి కర్మాగారాలు, నీటి నిలువ తొట్టెలను పరిశీలించారు. మహారాష్ట్ర బ్లాక్ టెక్నాలజీ మేనేజర్లు ఆనంద్ బోయిన్వాడ్, శివ్‌ప్రకాశ్ పత్వే, శివ్‌దర్శన్ గుమ్మన్వాడ్, అంకాపూర్ వీడీసీ అధ్యక్షుడు అనంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆలూర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఎండుతున్న ప్రకృతి వనం



డొంకేశ్వర్ పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

మండలం కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. అందులో నాటిన మొక్కలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. ఎండలకు చాలా మొక్కలు పూర్తిగా ఎండిపోయి ప్రకృతి వనం అందవిహీనంగా కనిపిస్తోంది. ప్రభుత్వం నిధులు ఖర్చు చేసి మొక్కలు నాటిస్తుంటే అధికారులు వాటిని పెంచడంలో ఈ విధంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. – డొంకేశ్వర్(ఆర్మూర్)

నీళ్లు లేక.. నిరుపయోగంగా..!

- బాల్కొండ మండల కేంద్రంలో టీటీడీ కల్యాణ మండపం పరిస్థితి
- పదేళ్లుగా పెళ్లిళ్లు.. పేరంటాలు లేని వైనం
- నీటి వసతి లేకపోవడమే కారణం



బాల్కొండలోని టీటీడీ కల్యాణ మండపం

బాల్కొండ: మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం నీటి వసతి లేక పదేళ్లుగా నిరూపయోగంగా ఉంది. 2014లో రూ.కోటి నిధులతో నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరూపయోగంగానే ఉంది. ఇప్పటి వరకు ఒక్క పెళ్లి లేదు.. పేరంటం లేదు. కారణం కల్యాణ మండపంలో నీటి సౌకర్యం లేకపోవడమే. నీటి వసతి కోసం రెండు బోరు బావులు తవ్వించినా చుక్క నీరు రాలేదు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడ సంబంధిత అధికారులు చేపట్టలేదు. 1994 నుంచి 2014 వరకు కల్యాణ మండప నిర్మాణం కోసం స్థానిక పండితుడు మారుతీ జోషి ఆధ్వర్యంలో తీవ్రంగా కృషి చేసి సాధించుకున్నారు. కానీ ప్రయోజనం లేకుండా పోతుంది. జిల్లాలో 7 టీటీడీ కల్యాణ మండపాలున్నాయి. జిల్లా కేంద్రంలో రెండు, ధర్పల్లి, నవీపేట్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్ మండల కేంద్రాల్లో ఒకటి చొప్పున ఉన్నాయి. ఇందులో ఆర్మూర్, బాల్కొండ మినహా ఇతర కల్యాణ మండపాలు లీజులో నడుస్తున్నాయి. రెండు కల్యాణ మండపాలు మాత్రం నిరూపయోగంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. బాల్కొండలోని కల్యాణ మండపం నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది. కల్యాణ మండపానికి కూత వేటు దూరంలో మిషన్ భగీరథ నీటి సరాఫరా పంపు హౌజ్ ఉంది. అక్కడి నుంచి కల్యాణ మండపానికి నిరంతరం నీటి సరాఫరాను ఏర్పాటు చేయవచ్చు. కాని అధికారులు ఆ వైపు కృషి చేయడం లేదు.

నీటి కొరత వల్లే..

బాల్కొండ టీటీడీ కల్యాణ మండపంలో నీటి కొరత వల్ల ఎవరూ ఎలాంటి కార్యక్రమాలకు తీసుకోవడం లేదు. నీటి కోసం రెండు బోరు బావులు తవ్వించినా చుక్క నీరు పడలేదు. మిషన్ భగీరథ నుంచి నీటి సరాఫరా విషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– రాజేశ్, టీటీడీ కల్యాణ మండపాల మేనేజర్, నిజామాబాద్

వచ్చే నెలలో నూతన గ్రంథాలయం ప్రారంభిస్తాం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి



రాజిరెడ్డిని సన్మానిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో నూతన గ్రంథాలయాన్ని వచ్చే నెలలో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన లైబ్రరీ భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు, పుస్తకాలు, ఇతర సామగ్రిని సమకూరుస్తామన్నారు. మండల కేంద్రవాసులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడే యువత పోటీ పరీక్షలు సిద్ధం కావచ్చని తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిసెరం భూమేశ్ రెడ్డి, లిఫ్టుల కమిటీ చైర్మన్ భోజారెడ్డి, నాయకులు బాపురావు, సుమన్ నాయక్ ఉన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

ఆర్మూర్‌టౌన్: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రాజారాం నగర్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, భక్తి శ్రద్ధలతో బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈర్ల రవి, సాంబడి కుమార్, ఉపాధ్యక్షుడు జంగిడి భోజన్న, కోశాధికారి జంగిడి సురేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ ఉంటుందని పేర్కొన్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో పెర్కిట్ – కోటార్మూర్ విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. సంఘం నూతన అధ్యక్షుడిగా నూనె నరేష్, ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాల సుభాష్ చందర్, గౌరవ అధ్యక్షుడిగా కొండ బుచ్చన్న, ఉపాధ్యక్షులుగా మూసల సతీష్, వేల్పుల శ్రీనివాస్, కోశాధికారిగా వొల్మాజి సంతోష్, సహాయ కోశాధికారిగా వేల్పుల లక్ష్మి నారాయణను ఎన్నుకున్నామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు సన్మానించారు.సంఘ సభ్యులు అమరవాజి చక్రధర్, గంగాధర్, మంచిర్యాల సురేష్, సుంకం గణేష్ తదితరులు పాల్గొన్నారు .

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం..

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లోని ఓం శ్రీ మొదటి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిందం రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎనుగందుల శైలేందర్, కార్యదర్శిగా జిందం మల్లేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా ఎనుగందుల శశిధర్, ద్యావరశెట్టి హన్మాండ్లు, దైవశెట్టిగా అంగిరి రమేష్‌లు ఎన్నికయ్యారు.

అన్ని రంగాల్లో మహిళలు పురోగతి సాధించాలి



పాల్గొన్న క్షత్రియ సమాజ్ మహిళలు

ఆర్మూర్‌టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి పురోగతి సాధించాలని క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు బచ్చేవాల్ రెడ్డి ప్రకాష్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్‌హాల్‌లో క్షత్రియ సమాజానికి చెందిన మహిళలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి దిక్సూచి లాంటి మహిళలు సమాజానికి సైతం బాసటగా ఉండాలన్నారు. అనంతరం ఆటపాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్షత్రియ ప్రాంతీయ సమాజ్ మహిళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖాందేష్ సంగీత, యువజన సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సాత్‌పుతే సంతోష్, దుమాని నీరజ్, మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భాను రామగిరి



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్మూర్ లైఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ధన్వంతరి విజయయాత్ర–2లో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ఎండీ ఫిజిషియన్ డాక్టర్ భాను రామగిరి, ఎండీ న్యూరో డాక్టర్ శ్రీకాంత్ లోయ, ఎండీ డీజీవో డాక్టర్ ప్రవంతి రెడ్డిలు వైద్య సేవలు అందించారు. 210 మంది రోగులను పరీక్షించి రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం సిఫారసు చేశారు. ఉప్లూర్‌తో పాటు నాగాపూర్, దమ్మన్నపేట, శ్రీరాజరాజేశ్వరీ నగర్, డబ్బ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి శిబిరంలో వైద్య సేవలను వినియోగించుకున్నారు. సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, వీడీసీ అధ్యక్షుడు సోమ దశరత్, నాయకులు ఎనెడ్ల మురళి, చిన్నారెడ్డి, లక్ష్మణ్, నందగిరి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఓ అందాల రాక్షసి 11.00, కిస్ కిస్ కిస్సిక్ 1.45, 7.35, ఆర్టిస్ట్ 4.35, 10.25
స్క్రీన్-2	ఛావా10.00, 4.00, 10.00 షణ్ముక 1.20, 7.20
స్క్రీన్-3	సలార్–పార్ట్–1 10.00, 4.05, 10.10 పెళ్ళికాని ప్రసాద్ 1.30, 7.35
స్క్రీన్-4	కోర్ట్ 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,900	వెండి(కిలో)	1,04,500
22 క్యారెట్స్	83,897		

– నిజామాబాద్ బిజినెస్